

తురకపాలెంలో డీపీవో పర్యటన

గుంటూరురూరల్: వరుస మరణాలు సంభవించిన గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామాన్ని డీపీవో నాగసాయికుమార్ మంగళవారం సందర్శించారు.



ఓజోన్ దినోత్సవ ర్యాలీ

రొంపిచర్ల: విప్పర్ల దళితవాడలోని ఎంపీపీ (ఎస్) పాఠశాలలో మంగళవారం ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఓజోన్ దినోత్సవ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.



ఖైదీలకు ఎయిడ్స్‌పై అవగాహన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా కారాగారంలో ఖైదీలకు మంగళవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ఐసీటీసీ (కౌన్సిలర్) శ్రీనివాసరావు అవగాహన సదస్సు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నాగార్జున కొండను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్



విజయపురిసౌత్: పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ మంగళవారం సందర్శించారు. మ్యూజియంలో బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, బోధి వృక్షాన్ని సందర్శించారు. అనంతరం సాగర్ డ్యామ్‌ను తిలకించారు. ఆయన వెంట సివిల్ సప్లయీస్ డీటీ బాషా, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్ఓ రవికుమార్ తదితరులు ఉన్నారు.

స్త్రీ శక్తి పథకాన్ని బాధ్యతతో స్వీకరించండి



మంగళగిరి టౌన్ : స్త్రీశక్తి పథకాన్ని బాధ్యతతో స్వీకరించి పని చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు సిబ్బందికి సూచించారు. మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఉత్తమ ఉద్యోగుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. డిపో పరిధిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం బస్టాండ్, గ్యారేజ్‌లో అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు చెంగలరెడ్డి, అప్పలరాజు, నాగేంద్ర ప్రసాద్, విమల, జాన్ సుధాకర్ ఇతర జోనల్ అధికారులు, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



పెదకాకాని: పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ దసరా మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గుంటూరులోని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కార్యాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్లు, బుక్‌లెట్‌లను ఆలయ ఉపకమిషనరుతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ఉప ప్రధాన అర్చక పేటేటి ధనమహేశ్వర ప్రసాదు, కార్యాలయ సిబ్బంది, పెదకాకాని మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పెండ్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై మంగళవారం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో భారతరత్న ఎమ్మెస్ సుబ్బులక్ష్మీ జయంతి నిర్వహించారు. తొలుత దేవస్థానం సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం యాయవరం సంపూర్ణ రాజ్యలక్ష్మీ కర్ణాటక సంగీత గాత్ర కచేరి చేపట్టారు. నరసుడు, గణేష్ పంచరత్నం, శ్రీమన్నారాయణ, సభాపతి, రామా నను బ్రోవరా, శంభో మహాదేవ, మినవ్యాల, స్వరజతి, భోగేంద్ర, డోలాయం వంటి అలరించిన స్వరాల కచేరి అలరించింది. మృదంగంపై సూర్యహరినాథ్, సాయిశ్రీధర్, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపకులు గుళ్లపల్లి సుబ్బారావు, గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి వై.శేషురాణి, సేవా సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియా రంగాన్ని కూటమి ప్రభుత్వం అణచివేసేలా చర్యలు చేపట్టడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తుందనే 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ప్రభుత్వ తప్పులను తప్పుగా పత్రికలు ఎత్తిచూపడాన్ని పాలకులు ఓర్చుకోలేకపోతున్నారు. ప్రజాస్వామ్యంలోని నాలుగో స్తంభంగా పరిగణింపబడే మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మాజీ ఎమ్మెల్యే,మంగళగిరి

వాస్తవాలు రాస్తే కేసులు పెడతారా?



కూటమి ప్రభుత్వ అక్రమాలు, దౌర్జన్యాలు, అవినీతి గురించి వాస్తవాలు రాస్తే 'సాక్షి'పై అక్రమ కేసులు పెడతారా..? ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేని విధంగా నీచ సంస్కృతికి కూటమి సర్కారు నాంది పలుకుతోంది. విలేకరుల సమావేశంలో టీడీపీ నేతల అక్రమాల గురించి మాట్లాడితే.. పత్రికపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ.. రాజ్యాంగ విలువలను కూటమి పాలకులు కాలరాస్తున్నారు. తెలుగు ప్రజలకు రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను వివరించటమే విలేకరులు చేసిన తప్పా? కూటమి ప్రభుత్వ వ్యవహారశైలి చూస్తుంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. నిజాలు నిర్భయంగా చెపుతూ, ప్రభుత్వ అక్రమాలను ప్రజలముందు పెట్టే 'సాక్షి'ని పాత్రికేయులను నిలువరించలేరు.

– షేక్ నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ, గుంటూరు నగర అధ్యక్షురాలు

అబ్బే.. నష్టమే లేదు



ఈ చిత్రంలో కనిపిస్తున్న నంబూరుకు చెందిన రైతు పేరు మందాళ వెంకటరెడ్డి. తనకున్న పది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట కొట్టుకుపోయింది. మళ్లీ పల్నాడు నుంచి నారు తీసుకొచ్చి పొలంలో నాటగా మళ్లీ కురిసిన వర్షంతో మునిగిపోయింది. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చాలా ఏళ్లుగా తాను వ్యవసాయం చేస్తున్నానని, గతంలో ఎప్పుడూ వరినారు కట్ట రూ.14 పెట్టి కొనలేదన్నాడు. ఈ ఏడాది రాజుపాలెం అడ్డరోడ్డులో ఒక్క నారుకట్ట రూ.14 వెచ్చించి కొనుక్కుని వచ్చానని, వరినారు పీకి ట్రక్కులో వేయడానికి కట్టకు మళ్లీ అంత ఖర్చు పెట్టినట్లు తెలిపాడు. అక్కడి నుంచి నంబూరు చేరడానికి బాడుగ అదనమని, ఇప్పటికే రెండు సార్లు నాటానని, రెండుసార్లు పంట మునిగిపోయినట్లు తెలిపాడు. ఈ ఏడాదంతా నష్టమేనంటూ వాపోయాడు.

- జిల్లాలో 72 వేల ఎకరాల్లో పంట నష్టం అంటూ ప్రాథమిక అంచనా
- నష్టపోవడంతో మళ్లీ పంట వేసుకున్న రైతులు
- నెల రోజుల తర్వాత ఎన్యూమరేషన్
- అసలు నష్టమేమీ జరగలేదంటూ తాజాగా నివేదిక
- వరిపైరు మూడోసారి కూడా వాననీటిలోనే...
- విస్మయం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పంట నష్టం అంచనాలో అధికారుల అసత్యాలు



పెదకాకాని మండలం నంబూరులో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, పెదకాకాని: గుంటూరు జిల్లాలో వర్షాల వల్ల ఒక్క ఎకరం పంట కూడా నష్టపోలేదంట.. ఇది జిల్లా వ్యవసాయ అధికారుల తీరు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో మొత్తం 71,612 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు గుర్తించారు. వరి 62,275 ఎకరాలు, పత్తి 8,550 ఎకరాలు, మినుము 787.5 ఎకరాల్లో నీట మునిగినట్లు గుర్తించారు. ఇందులో ఎక్కువ భాగం కోలుకునే అవకాశం లేదని మళ్లీ వేసుకోవాల్సిందేనని అధికారులు చెప్పారు. దీంతో రైతులు మళ్లీ పొలాల్లో పంటలు వేశారు. అనంతరం ఎన్యూమరేషన్ చేసిన అధికారులు అసలు పంటలేమి నష్టపోలేదంటూ నివేదిక పంపడంపై రైతులను విస్మయానికి గురిచేస్తోంది.

ఇప్పటికే పలుమార్లు మునిగింది

పంటలు నీట మునిగిన తర్వాత నాలుగైదు రోజుల్లో పొలాల్లో నుంచి నీరు తగ్గడంతో 20 నుంచి 30 శాతం పంట మాత్రమే బతికింది. మిగిలిన చోట మళ్లీ పంట వేయొచ్చననే అధికారుల మాటలు నమ్మి పల్నాడు నుంచి నారు తీసుకువచ్చి రైతులు పంటలు వేసుకున్నారు. ఇప్పటికే రూ.10వేల నుంచి 12వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. తాజాగా మళ్లీ గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునిగాయి. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమపై అన్యాయంగా వ్యవహరిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించలేదని, కనీసం విత్తనాలైనా ఇవ్వలేదని చెబుతున్నారు. ఈక్రమంలో అసలు ఒక్క ఎకరమూ మునగలేదంటూ అధికారులు నివేదిక పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడోసారి మునిగిపోయింది



ఈ ఏడాది వరి పంటలో అంతా నష్టమే. ఇప్పటికి రెండు సార్లు వరి విత్తనాలు ఎదపెట్టాం. నీటిలో మునిగి పంట దెబ్బతినింది. మూడోసారి వరినారు కొని నాట్లు వేశాం. మళ్లీ పైరు మునిగిపోయింది. పొలం దుక్కులు దున్నడం, విత్తనాలు ఎదపెట్టడం, గడ్డి మందు చల్లించడం, మొక్క మొలిసిన తరువాత దెబ్బతినడంతో ఇప్పటికే రూ.20 వేలు ఖర్చు అయింది. పంట చేతికి వస్తే వచ్చింది అనుకోవడమే.

– సాదం గోపయ్య, రైతు, నంబూరు

ఎప్పుడు ఇంతలా మునగలేదు



నేను చాలా ఏళ్ల నుంచి వరిపంట సాగు చేస్తున్నా. వర్షాలు బాగా వచ్చిన సంవత్సరం పొలాల్లోకి నీరు చేరేది. వానలు తగ్గిన తరువాత నీరు బయటకు పోయేది. ఎరువులు, పురుగుమందులు వేసి సాగు చేస్తే పంట ఎప్పటి మాదిరిగానే బాగా పండేది. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు మునిగిపోయింది. 15 రోజులుగా పొలం చెరువులా ఉంది. ఎకరానికి 25 కిలోలు చొప్పున యూరియా ఇస్తామంటున్నారు. రాజధాని ప్రాంతం నీరు రావడం వలనే పొలాలు మునుగుతున్నాయి.

– మెరుగుమాల రవికుమార్, కౌలు రైతు, తంగెళ్ళమూడి

పెద్దమొత్తంలో నొక్కేసే ప్లాను

- కాసులు కురిపిస్తున్న అనధికార నిర్మాణాలు
- కూటమి నేతల అండతో ప్లాను లేకుండానే ఇళ్ల నిర్మాణాలు
- భవనాలు, అపార్టుమెంట్లపై 4,5 అంతస్తుల నిర్మాణం
- రాజకీయ అండ లేని సామాన్యులపై అధికారుల ప్రతాపం



తెనాలి: పట్టణంలో అనధికార నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి పార్టీల నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ జీఓతో లైసెన్స్‌డ్ ఇంజినీర్లు ఇళ్ల నిర్మాణానికి ప్లాన్లు ఇవ్వడం లేదు. దీంతో పలుచోట్ల ప్లాను లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నారు. మరోవైపు పట్టణంలో ఇప్పటికే నిర్మించిన భవనాలు, అపార్టుమెంట్లపై 4, 5 అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పరిణామాలు కూటమి నేతలకు కలిసొచ్చింది. అందినకాడికి వసూళ్లు చేస్తున్నారు. అదే అదనుగా సంబంధిత అధికారులూ భవన నిర్మాణ దారుల్నుంచి తమ వంతు వాటాలనూ దండుకుంటున్నారు. ఏ అండా లేని సామాన్యుల ఇళ్ల నిర్మాణాలపై అధికారులు ప్రతాపం చూపిస్తున్నారు.

ముడుపులు ముడితేనే..

భవన నిర్మాణ అనుమతుల కోసం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం గత మార్చి నుంచి అమల్లోకి వచ్చింది. ఎక్కడైనా, ఎవరైనా ఇంటి యజమానులు, నిర్మించిన కట్టడాల్లో సాంకేతికపరంగా తప్పులు చేసినట్టు నిర్ధారణ అయితే సంబంధిత లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ లైసెన్సును ఐదేళ్లపాటు రద్దుచేస్తారు. తప్పు తీవ్రత ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంది. దీనిని ఇంటి యజమానులు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్/ సర్వేయర్లు వ్యతిరేకించటంతో ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్లు గీసే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పలువురు అనధికారంగా తమకు కావాల్సిన విధంగా ఇళ్ల నిర్మాణం చేసేస్తున్నారు. అలాంటి యజమానుల నుంచి సంబంధిత స్థానిక ప్రజాప్రతినిధి/కూటమి పార్టీల నేతలకు ముడుపులు వసూలు చేస్తున్నారు. అటుకేసి ఎవరైనా అధికారి వచ్చినా, నాయకుల ఆదేశాలతో తమ వంతు తాము తీసుకుని వెనుదిరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి.

- తెనాలి పట్టణంలో అనధికారంగా ప్రస్తుతం పదికిపైగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇవన్నీ రాజకీయ అండదండలతో జరుగుతున్నాయి.
- ఉదాహరణకు రైల్వేస్టేషన్‌రోడ్డులోని ఓ హోటల్ సమీపంలో నిర్మిస్తున్న భవనానికి ఎలాంటి అనుమతులు లేవు. కూటమి పార్టీలకు చెందిన కొన్సిలరుకు పెద్ద మొత్తంలో నగదు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.
- బోసురోడ్డులో నిర్మాణంలో ఉన్న మరో భవన యాజమానిని అధికారులను పంపి, బెదిరించటంతో సదరు వ్యక్తి పెద్ద మొత్తంలో నగదు చెల్లించినట్టు బహిరంగంగానే చెబుతున్నారు.
- నాజరుపేట, రామలింగేశ్వరపేటల్లో ఇటీవల అనధికారంగా నాలుగో అంతస్తు నిర్మాణాలు జరిగాయి. అధికారులు అడ్డుకోకపోవటంతో, వీటివెనుక కూటమి పార్టీల నాయకుల ప్రమేయం ఉందని అర్థమవుతోంది.
- స్వరాజ్ టాకీస్ ఎదురు రోడ్డులో, వహాబ్‌చౌక్‌తో సహా పలు ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతున్నా, అడ్డుకోకపోవటం మామూళ్ల ప్రభావమేనని జనం బాహాటంగానే చెబుతున్నారు. వీటిని అడ్డుకోని అధికారులు, సాధారణ పౌరులు సొంత ఇళ్లపై నిర్మాణాలు చేపడితే మాత్రం అడ్డుకోవటం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

అనధికారికంగా.. యథేచ్ఛగా..

భవనాలు, అపార్టుమెంట్లపై నిబంధనలకు విరుద్ధంగా 4,5 అంతస్తుల నిర్మాణం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిచిపోయింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఇందుకు అనుమతించలేదు. టీడీపీ ఎమ్మెల్సీ సానుకూలంగా ఉన్నప్పటికీ మంత్రి అడ్డుచెప్పటంతో భవన నిర్మాణ దారులు గగ్గోలు పెట్టారు. రాష్ట్రంలో అన్ని పట్టణాల్లో 4,5 అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని ఫొటోలు, ఆధారాలతో వినతి పత్రాలు ఇస్తూ, తెనాలిలోనూ అనుమతించాలని కోరుతూ వచ్చారు. గత నెలలో మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అప్పటికి పెండింగులో ఉన్న 29 భవనాలకు మాత్రమే అనుమతి అంటూ స్పష్టంగా చెప్పారని అంటున్నారు. దీంతో పట్టణంలో సీను మారిపోయింది. రాజకీయ అండ ఉన్న పలువురు అక్రమ కట్టడాలను చకచకా నిర్మిస్తున్నారు. పెండింగులో ఉన్న 29 భవనాలే కాదు.. మరికొన్ని నిర్మాణాలను యథేచ్ఛగా చేస్తున్నారు. రాత్రుళ్లు కూడా శ్లాబులు వేసేస్తున్నారు. నోరున్న కూటమి పార్టీల కౌన్సిలర్లు, ఆయా పార్టీల నేతలను ప్రసన్నం చేసుకున్నారు. దీంతో అడ్డుకోవటానికి వెళ్లిన అధికారులను కూడా కొందరు కౌన్సిలర్లు/పార్టీ నేతలు బెదిరించినట్టు ఆరోపణలున్నాయి.

అమ్మవారి ఆలయంలో కూటమి రాజకీయాలు!

- టీడీపీ నేతలకు ఆదాయ వనరుగా శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం
- తమ కోటా కింద రూ.50వేలు సమర్పిస్తేనే కమిటీలో చోటు
- గత నవరాత్రులకు భక్తులు ఇచ్చిన రూ.లక్షలు బొక్కేసిన వైనం
- మళ్లీ జంబో కమిటీ ఏర్పాటు
- కూటమి కమిటీని అంగీకరించలేక పోతున్న ఆర్యవైశ్య ప్రముఖులు
- ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆలయాన్ని అప్రదిష్టపాలు చేస్తున్నారంటూ మండిపాటు



శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అమ్మవారి ఆలయంలో కూటమి నేతలు అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు నగరంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా వేసిన కమిటీపై ఆర్యవైశ్య సంఘాలు భగ్గుమంటున్నాయి. ఎన్నడూ లేని విధంగా 100 మందితో జంబో కమిటీ వేయటం.. దానికి స్థానిక ప్రజాప్రతినిధికి భజన చేసే వారికి, ఆయన కోటా కింద రూ 50వేల వరకు కప్పం చెల్లించిన వారికి కమిటీలో చోటు ఇచ్చారనే వాదనలు లేకపోలేదు. ఆర్యవైశ్యులు కాకుండా కమిటీలో ఇతరులు సైతం అగ్రభాగంగా ఉండటంపై మండిపడుతున్నారు. ఈ కమిటీకి మేం సహకరించలేమని ఆర్యవైశ్య సంఘాలు బాహాటంగానే చెబుతున్నాయి.

ఉత్సవాల పేరిట దోపిడీ

కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్నంబజారులో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని కొంత మంది తెలుగుదేశం పార్టీ నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కనీస అర్హత కూడా లేకుండా, ఇష్టానుసారంగా కమిటీలు వేసి, ఉత్సవాల పేరిట దోపిడీ చేస్తున్నారు. గత ఏడాది ఏకంగా రూ 1.15కోట్లు వసూలు చేసిందిగాక.. రూ 15లక్షల వరకు అప్పుతేలిందని అనధికారిక కమిటీ అమ్మవారి సాక్షిగా మీడియా సమావేశంలో ప్రకటించటంపై ఆర్యవైశ్యుల్లో అనుమానాలు మరింత పెరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయం వద్ద జరిగే అన్నదాన కార్యక్రమాన్ని నిలిపివేశారు. అదే విధంగా బయట ఉన్న షెడ్డును తొలగించారు. కనీసం మంచినీటి సదుపాయం లేకుండా లేకుండా చేయటం, అధికారికంగా ఉన్న కమిటీకి ఎటువంటి విలువనివ్వకుండా అడ్డుఅదుపూ లేని అవినీతితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు అనేక వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

మొద్దునిద్రలో దేవదాయ అధికారులు

వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న తంతుపై దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారు. స్పష్టమైన ఆలయ కమిటీ, చైర్మన్, సభ్యులు ఉన్నప్పటికీ వారికి ఎటువంటి సంబంధం లేకుండా, కూటమి నేతలు కమిటీ ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు నిర్వహిస్తున్నా.. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా.. తమకేమి పట్టని చందంగా వ్యవహరిస్తున్నారు. ఏ అధికారంతో కమిటీ వసూళ్లు చేస్తోందనే అంశంపై దృష్టి సారించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.లక్షలు బొక్కేసి.. అప్పులు తేల్చి

2023 సంవత్సరంలో రూ 54 లక్షల అప్పటి కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. కేవలం ఏడాది వ్యవవధిలో రూ 1.15కోట్లు వసూలు చేయగా, మరో 12 లక్షలు జీఎస్టీతో కలిపి అప్పులు ఉన్నాయని, అసలు ఆలయంపై ఏ హక్కు లేని కూటమి నేతలు చెప్పటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పులతో కలుపుకొని సుమారుగా రూ 1.30కోట్లు ఏం ఖర్చు చేశారో చెప్పాలని దాతలు అడుగుతున్న నేపథ్యంలో కూటమి నేతలకు మింగుడు పడటం లేదు. గతంలో కేవలం 9 లేదా 10 మందితో కమిటీ నిర్వహణ ఉండేది. ఇప్పుడు ఏకంగా 100 మందితో జంబో కమిటీని వేయటం, స్థానిక ప్రజాప్రతినిధికి రూ.50వేలు ఇస్తేనే కమిటీలో చోటు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



హామీలకు అతీగతి లేదు

ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక డిమాండ్లు, ఇతర న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు ర్యాలీ, నిరసన ప్రదర్శన చేశారు. ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 15 నెలలు గడిచినా ఒక్క ఆర్థిక డిమాండ్ కూడా నెరవేరవేర్చలేదని ధ్వజమెత్తారు. సీపీఎస్‌పై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని, నేటికీ దానిపై అతీగతి లేదన్నారు. అనంతరం జేసీ అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేశారు. - గుంటూరు వెస్ట్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,200 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 353

కొమ్ములు : 179 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,350	10,225	10,000

కాయలు : 174 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,350	10,561	10,000

మొత్తం అమ్మకాలు : 264.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	43,052
అమ్మకాలు	42,929
నిల్వ	8,801



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,300
నంబరు-5	10,000-13,400
273	10,500-13,500
341	10,000-15,000
4884	11,500-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,200
నంబరు-5	10,000-15,800
341	11,000-15,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,000
బాడిగ-355	10,000 - 16,000
దేవనూరు డీలక్స్	10,500 - 13,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-16,000
దేవనూరు డీలక్స్	10,500-14,300
తాలు	5,200 - 7,300

-కొరిటిపాడు (గుంటూరు)

ఘర్షణలో నిందితుడికి రిమాండ్

బల్లికురవ: మండలంలోని వేమవరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో జరిగిన ఘర్షణలో నిందితుడికి అద్దంకి కోర్టు మంగళవారం 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వై.నాగరాజు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన ఘర్షణలో నిందితునిగా ఉన్న ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన జాగర్లమూడి వీరాంజనేయును అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

రోడ్లపైనే జంతువుల వధ

- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నరసరావుపేటటౌన్: నరసరావుపేట పట్టణంలో బహిరంగంగానే జంతువులను వధిస్తున్నారు. బహిరంగ జంతు వధ నిషేధం అమలులో ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రక్తం, అవశేషాలు, దుర్వాసన వాతావరణాన్ని కలుషితం చేస్తుండగా, కాలుష్య సమస్యలు ఆరోగ్యానికి ముప్పు తెచ్చిపెడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డీమార్ట్ పక్కన, హార్ట్ జూనియర్ కళాశాల ఎదుట ప్రతి ఆదివారం పందులను నడిరోడ్లపై యథేచ్ఛగా వధ చేస్తున్నారు. దీంతో పాటు ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ఎదుట గాడిదలను అక్కడే వధ చేసి మాంసం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మాంసం విక్రయాలపై ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. వధ చేసే పరిసరాల చుట్టుపక్కల చెదలు, కుక్కలు చేరి దుర్వాసన వ్యాపిస్తోంది. రహదారులపై మిగిలిపోయే రక్తం, మాంసపు ముక్కల వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

పలుమార్లు మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా, పెద్దగా చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రతి వారం మాంసం విక్రయదారుల నుంచి మామూళ్లు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ, శుభ్రతపై నినాదాలు చేస్తూనే.. మరోవైపు బహిరంగ వధలపై పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.



హార్ట్ కళాశాల ఎదుట మాంసం విక్రయిస్తున్న దృశ్యం

ప్రజారోగ్యంపై దుష్ప్రభావాలు

వధ సమయంలో తగిన శానిటేషన్ లేకపోవడం వల్ల జూనోటిక్ వ్యాధులు (జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులు) వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. జంతువుల రక్తం, అవశేషాలు వల్ల హెపటైటిస్-ఎ, టైఫాయిడ్, కలరా, లెప్టోస్పైరోసిస్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందవచ్చు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు లేకుండా వచ్చిన మాంసం ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీస్తుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలపై ఇవి ఎక్కువగా ప్రభావితం చూపిస్తాయి. కలుషిత మాంసం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, బహిరంగ వధలకు పాల్పడే వారికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

పర్యావరణంపై ప్రభావం..

రక్తం, మాంసపు ముక్కలు వలన దుర్వాసన కాలుష్యం ఏర్పడుతుంది. చెదలు, ఎలుకలు, కుక్కలు చేరి పర్యావరణంలో మలిన వాతావరణం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. వర్షపు నీటితో ఈ మలినాలు కలసి కాలువలు, తాగునీటి వనరులు కలుషితం అవుతాయి. ఈ పరిణామాలు పర్యావరణానికే కాక ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతోపాటు రోడ్ల మీద వధ చూసే పిల్లల్లో భయం, మానసిక ఒత్తిడి కలుగుతుంది. ప్రజల్లో సమాజ శుభ్రతపై నిరాసక్తత పెరుగుతుంది. బహిరంగ వధ ప్రాంతాల్లో నివసించే వారికి సామాజిక అవమానం, జీవన ప్రమాణం తగ్గడం మొదలవుతుంది.

విచారించి చర్యలు తీసుకుంటాం



బహిరంగ జంతు వధకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. హార్ట్ జూనియర్ కళాశాల, ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలల వద్ద తనిఖీలు చేపట్టి అక్రమంగా జంతు వధకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాము.

-జస్వంత్‌రావు, మున్సిపల్ కమిషనర్

బలరాముడి బంగారు పాదుకలకు ప్రత్యేక పూజలు



నగరంపాలెం: అయోధ్యలో ప్రతిష్టించేందుకు తరలి వెళ్తున్న బాలరాముడు, కోదండం, రామబాణం, బంగారు పాదుకలకు మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 14 కిలోల వెండి, కిలో బంగారంతో చల్లా శ్రీనివాస శాస్త్రి తయారు చేయించగా, భక్తుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. అయోధ్యలో ప్రతిష్ఠకు బయలుదేరుతున్న క్రమంలో దేశంలోని అనేక ప్రాంతాల్లోని భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించడం, పలువురు పీఠాధిపతులచే పూజలను నిర్వహి స్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ బృందం పాల్గొన్నారు.

27లోపు ఐటీఐ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, ఐటీఐ జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో చేరదలచిన వారు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారు తెనాలి, గుంటూరులలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో తమ సర్టిఫికెట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. 30న అన్ని ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 9391402683 నెంబరులో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బల్లికురవ: బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో బయట పడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని కొప్పరపాడు, వినుకొండ ఆర్అండ్‌బీ రోడ్డులోని కూకట్లపల్లి యానాది సంఘం వద్ద జరిగింది. ఎస్సై వై. నాగరాజు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని వెలమవారి పాలెం పంచాయతీలోని కె.జమ్ములమడక కాలనీకి చెందిన గద్దల పేతురు (36), నూనె రమేష్ మోటారు బైక్‌పై వినుకొండ వెళ్తున్నారు. ఈ క్రమంలో వినుకొండ నుంచి కొప్పరపాడు వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఇద్దరు తీవ్ర గాయాలపాలవ్వగా స్థానికులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పేతురు మృతి చెందాడు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : ఓ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. గుంటూరు లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్, ఎస్‌హెచ్‌వో శివప్రసాద్‌లు కేసు వివరాలను వెల్లడించారు. సంగడిగుంటలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన పేంటల మణికంఠ (27)ను ఈ నెల 8వ తేదీన రాత్రి కొందరు వ్యక్తులు అతని ఇంటి వద్ద దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో మణికంఠ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, మరుసటి రోజు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా పాత గొడవల నేపథ్యంలోనే నిందితులు మణికంఠపై దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. గతంలో మణికంఠకు చుట్టుగుంటలోని కావేరినగర్‌కు చెందిన యర్రం యశ్వంత్‌కు మధ్య వివాదాలు ఉన్నాయి. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఒక ఊరేగింపులో ఎదురుపడ్డ ఇరువురి మధ్య మరోసారి వివాదం రేగింది. దీంతో మణికంఠ ఇంటి వద్దకు వెళ్లి యశ్వంత్, మారగాని వంశీ సాయికృష్ణ, మాడుగుల రోహిత్‌సాయికుమార్, యక్కటిల గురవయ్య, వల్లభనేని గణేష్, షేక్ మునాఫ్, వేముల కళ్యాణ్‌కుమార్, షేక్ ముస్తఫా, షేక్ నాగూర్‌మస్తాన్, రంగిశెట్టి వెంకటరమణ, అమృతపూడి సుధాకర్‌లు దాడి చేసి చేసినట్లు గుర్తించారు. మంగళవారం పొన్నూరు బైపాస్‌లోని సత్యసాయి ట్రస్ట్‌కు ఎదుట అండర్ పాస్ బ్రిడ్జి వద్ద నిందితులు ఉన్నారని సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 11 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

రెండేళ్ల క్రితం తప్పిపోయిన తల్లి, పిల్లల గుర్తింపు

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

మంగళగిరి: రెండేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ, ఆమె ఇద్దరి పిల్లలను గుర్తించి పట్టుకుని, కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన కట్టా లక్ష్మి అనే మహిళ మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలో నివసించే తన కుమార్తె తోకల తిరుపతమ్మ(23) ఆమె ఇద్దరు పిల్లలు మోక్ష శ్రీనాథ్(5), స్నేహశ్రీ(3)లు కనిపించడం లేదని 2023 ఏప్రిల్ నెలలో మంగళగిరి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త సరిగా చూడడం లేదనే కారణంతో మనస్థాపం చెందిన తిరుపతమ్మ తన పిల్లలతో సహా ఎక్కడికో వెళ్లిపోయిందని తల్లి లక్ష్మి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ వెంకట్‌లు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టినట్లు తెలిపారు. అనేక ప్రాంతాలలో సమాచారం సేకరించి చివరకు గుంటూరు జిల్లా బుడంపాడులో వున్నట్లు గుర్తించి తిరుపతమ్మను, పిల్లలను మంగళవారం తల్లి లక్ష్మి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కేసును చేధించి తల్లి, పిల్లలను కనుగొన్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో పాటు బృందంలోని సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించినట్లు తెలిపారు.



తప్పిపోయిన మహిళ, చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రూరల్ సీఐ

అనుమానంతో భార్య చేయి నరికిన భర్త

మేడికొండూరు మండలం వెలవర్తిపాడులో ఘటన

మేడికొండూరు: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మద్యం మత్తులో కత్తిపీటతో ఆమె చేయి నరికిన ఘటన జరిగింది. మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలవర్తిపాడు గ్రామానికి చెందిన దాసరి రాజు నిత్యం మద్యం తాగి వచ్చి తన భార్య దాసరి రాణిపై అనుమానంతో వేధిస్తూ ఉంటాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఆమెతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై ఇంట్లో ఉన్న కత్తిపీటతో రాణి కుడిచేతిని నరికేశాడు. రాణి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మేల్కొని సంఘటన స్థలానికి చేరుకున్నారు. అంతలో రాజు నరికిన చేతిని ఒక సంచిలో వేసుకుని, 108 అంబులెన్స్ సహాయంతో బాధితురాలిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించాడు. రాజుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.



తీవ్రంగా గాయపడిన దాసరి రాణి

నేపాల్ బాలిక అదృశ్యం

లక్ష్మీపురం: నేపాల్‌కు చెందిన బాలిక అదృశ్యమైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నేపాల్ దేశానికి చెందిన గోవింద్ తాప అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడ హోటల్‌లో పని చేసుకుంటున్నాడు. అయితే ఇటీవల రెండు నెలల క్రితం గోవింద్ తాప కుమార్తె సరిత కుమారి తాప కొంత మందితో కలిసి గుంటూరుకు వచ్చి, గుంటూరులోని రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. అయితే ఈనెల 14వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. విషయం తెలుసుకున్న తండ్రి గోవింద్ తాప గుంటూరు వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలలో, బంధుమిత్రుల వద్ద వెతుకులాడినా ఆచూకీ తెలియక పోవడంతో దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీసు స్టేషన్ 0863- 2231955, సీఐ ఆరోగ్య రాజు 8688831332, ఎస్ఐ రోజాలత, 8688831334, నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా సూచించారు.



సరిత కుమారి తాప

వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ ఎంపికలు నిర్వహించినట్లు ఆ విభాగం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వి.దివ్యతేజో మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గంగాధర్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జాతీయ సేవా పథకంలో ఉన్నటువంటి వలంటీర్లు సేవాభావంతో పాటుగా దేశభక్తి, ఆపదలో సాటి మనిషికి సహాయం చేసే తత్వాన్ని కలిగిఉండాలన్నారు. రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో ప్రవేశించిన వలంటీర్లకు ఎన్నో గొప్ప అవకాశాలు ఉన్నాయని, సేవాభావాలతో పాటుగా నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ సేవాపథకం వలంటీర్లు సమయ పాలన, క్రమశిక్షణ, భవిష్యత్తు ప్రణాళికలు వంటి లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

శతాధిక వృద్ధురాలి మృతి

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మందపాటి రమేష్‌రెడ్డి తల్లి అప్పమ్మ(103) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఆమెకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలంగాణలో రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో అప్పమ్మ పాల్గొన్నారు. ఆమెపై నిర్బంధం ఉండడంతో రెండేళ్లపాటు అడవుల్లో అజ్ఞాత జీవితం గడిపారు. అప్పమ్మ భర్త అప్పిరెడ్డి నడికుడి మేజర్ పంచాయతీ సర్పంచిగా పదేళ్లపాటు పనిచేశారు. అప్పమ్మకి ఆరుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.



అప్పమ్మ(ఫైల్)

సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూడాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ -2025 ద్వారా నియామకం అవుతున్న ఉపాధ్యాయులు విధుల్లో చేరకముందే, సీనియర్ ఉపాధ్యాయులకు పాఠశాలల్లో ఉన్న ఖాళీ స్థానాల్లో సర్దుబాటు చేసి, క్లస్టర్ వేకెన్సీలలో కొత్త ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు క్లస్టర్‌లో ఉండి జూనియర్ ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండడం జరిగితే సీనియర్లకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా 2025 డీఎస్సీలో ఎంపికైన ఖాళీలను కూడా ఈ నియామకాల్లోనే భర్తీ చేయాలని, లేనిచో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ వివరాలు తీసుకొని పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జూన్ మాసంలో ఉపాధ్యాయ బదిలీలు జరిగిన తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కూడా విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

ఏబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన
- గెస్ట్ ఫ్యాకల్టీ నారాయణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

రేపల్లె(చెరుకుపల్లి): రేపల్లె పట్టణంలోని అనగాని భగవంతరావు(ఏబీఆర్) డిగ్రీ కళాశాల విద్యార్థి సొంటి రామ్ మల్లేష్ సోమవారం కళాశాల ప్రాంగణంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సహచర విద్యార్థులు గుర్తించి అతనిని ఆస్పత్రికి తరలించారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనకు బాధ్యుడైన గెస్ట్ ఫ్యాకల్టీ నారాయణపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి వై.నవీన్ మాట్లాడుతూ విద్యార్థి సొంటి రామ్ మల్లేష్ పట్ల గెస్ట్ ఫ్యాకల్టీ నారాయణ కొంత కాలంగా కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. సోమవారం తరగతులకు అనుమతించకుండా వేధింపులకు గురిచేయడంతోపాటు టీసీ ఇచ్చి ఇంటికి పంపుతానని బెదిరించాడని తెలిపారు. చదువుకు దూరం అవుతాననే భయంతో మనస్తాపం చెందిన మల్లేష్ కళాశాల ఆవరణలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సమగ్ర విచారణ జరిపించి, నారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తిరిగి కళాశాలలో చదువుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. సైన్స్ విభాగానికి కొత్త ఫ్యాకల్టీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సూర్యప్రకాశరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ఏబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆఫీసు ముందు బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు